ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

సోమవారం 12 మే 2025

వైభవంగా కైవార తాతయ్య ఆరాధన మహోత్సవం

నకిలీ బంగారం కేసు..
● నిందితుడి అరెస్ట్
● రూ.10 లక్షల స్వాధీనం
● పురాతన బంగారం పేరుతో భారీ మోసం
6



భార్య పవిత్రతో జైవంత్

# సంబరాలు వీడి.. సమరానికి..!



- అత్యవసరంగా విధులకు బయల్దేరుతున్న సైనికులు
- వివాహం ముగిసి పదిరోజులు.. పిలుపు రావడంతో హనీమూన్ నుంచి వెనక్కి..
- ఏడురోజుల కన్నబిడ్డను వదిలి మరొకరు..



విధుల్లో చేరిన జైవంత్

బెంగళూరు, మే 11(ఆంధ్రజ్యోతి): దేశసేవ కోసం సైనికులు కదలివెళ్తున్నారు. అందులో పెళ్లై వారం రోజులయిన జవానులు, వారం రోజుల కన్నబిడ్డను సైతం వదిలి యుద్ధభూమికి తరలివెళ్తున్నారు. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలకు దీటుగా సమాధానం చెప్పిన సైన్యం కొన్ని కఠిన నిబంధనలకు సిద్ధమైంది. ఆపరేషన్ సిందూర్ కారణంగా సైనికులకు సెలవులు రద్దు చేశారు. పెళ్లిళ్లు, తదితర శుభ కార్యక్రమాలకోసం వచ్చిన పలువురు సైనికులు ఉన్నఫళంగా తరలి వెళ్లక తప్పడం లేదు. ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకా సిద్దాపురకు చెందిన సైనికుడు జైవంత్ వెంకటేశ్ హనీమూన్‌ను రద్దు చేసుకుని తిరిగి విధుల్లోకి వెళ్లారు. మే 1న జైవంత్ వెంకటేశ్‌కు వివాహం జరిగింది. నవదంపతులు నాలుగైదు రోజులపాటు శాస్త్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్లి వచ్చారు. ఊటీకి హనీమూన్ వెళ్లేందుకు బయల్దేరారు. మైసూరుకు చేరుకోగానే సైనిక ఉన్నతాధికారులనుంచి సమాచారం రావడంతో హనీమూన్‌కు వెళ్లకుండా స్వగ్రామానికి వెనుదిరిగి వచ్చి వెంటనే విధులకు బయల్దేరారు. జైవంత్ వెంకటేశ్ చత్తీస్‌ఘడ్‌లోని సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్నారు. సైనికుడి భార్య పవిత్ర మాట్లాడుతూ పెళ్లి శాస్త్రాలు ముగిసి హనీమూన్‌కు బయల్దేరామని, అంతలోనే సమాచారం రావడంతో విధులకు వెళ్లారన్నారు. దేశం ముఖ్యమని, దేశ సేవ చేసే సౌభాగ్యం అందరికీ లభించదని చెప్పి విధులకు వెళ్లారన్నారు. మా తల్లిదండ్రులు, అత్తమామలు, బంధువులు ధైర్యంగా వెళ్లిరావాలని తెలిపామన్నారు.

## భార్య ప్రసవానికి సెలవుపై వచ్చి..

● భార్యకు డెలివరీ ఉండడంతో సెలవుపై వచ్చిన కలబురగి జిల్లా సీఆర్‌పీఎఫ్ సైనికుడు హనుమంతరాయ విధులకు బయల్దేరారు. ఆయన 15రోజుల సెలవుపై వచ్చారు. వారంక్రిందట మగశిశువు జన్మించాడు. మరో వారం రోజులు సెలవు ఉన్నా ఉన్నతాధికారులనుంచి సందేశం రావడంతో వెనుదిరిగారు. బయల్దేరే వేళ సైనికుడు హనుమంతరాయ మాట్లాడుతూ బిడ్డ, కుటుంబం కంటే దేశం ముఖ్యమని సైన్యంలో చేరేముందు ఇదే వేదవాక్కుగా భావించానన్నారు.

● విజయపుర జిల్లా బబలేశ్వర్ తాలూకాకు చెందిన సైనికుడు సిద్దప్ప సెలవుపై వచ్చారు. అత్యవసర సందేశం మేరకు కలబురగి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడనుంచి పశ్చిమబెంగాల్ వెళ్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, బంధువులు సిద్దప్పకు వీడ్కోలు పలికారు. బీదర్ జిల్లా బాల్కి తాలూకా బసవకిరణ చెల్లెలి పెళ్లి కోసం స్వగ్రామానికి వచ్చారు. ఏప్రిల్ 27న గ్రామానికి వచ్చిన బసవకిరణకు సందేశం రావడంతో వెనుతిరిగారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



భార్య, బిడ్డతో హనుమంతరాయ



# చల్లదనమే..!

- ఈ ఏడాది మేలోనే నైరుతి రుతుపవనాలు
- 16ఏళ్ల తర్వాత ముందస్తుగా.. రైతుల్లో హర్షం

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ తొలివారంలో నైరుతి రుతుపవనాలు కేరళ మీదుగా కర్ణాటకకు ప్రవేశించేవి. అయితే ఈనెల 27నే కేరళకు రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. తర్వాత రాష్ట్రంలోకి రెండు మూడురోజుల్లోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. 2009లో మే 23న కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించాయి. ఆ వెంటనే రాష్ట్రంలోకి రుతుపవనాలు వచ్చాయి. ఇలా 16ఏళ్ల తర్వాత నాలుగైదురోజులు ముందుగానే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తుండడంతో రైతులకు సంతోషకరమైన సమాచారం అందినట్లయ్యింది. వాతావరణ పరిశోధనశాఖ నైరుతి రుతుపవనాలకు ముందు కూడా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. 12న సోమవారం బెంగళూరుతోపాటు దక్షిణాది జిల్లాల్లో వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



## ఘనంగా నృసింహ జయంతి

ముళబాగిలు, మే 11 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కదరీపుర గ్రామంలో ప్రసిద్ధి చెందిన కంబద లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నృసింహ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ, గరుడ వాహనోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు బిందుమాధవ రావ్, సహాయక అర్చకులు ఎంటీ దీపు విఠల్, అనంత్‌ల నేతృత్వంలో పూజా కైంకర్యాలు సాగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

← విశేష అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

# హై సెక్యూరిటీపై.. నిర్లక్ష్యం..!

- నంబర్ ప్లేట్ల ఏర్పాటుపై ఆసక్తి చూపని వాహనదారులు
- రాష్ట్రంలో 2కోట్లకుపైగా వాహనాలు..
- హెచ్ఎస్ఆర్‌పీ అమలయ్యింది 57 లక్షలే
- ఏడుసార్లు గడువు పొడిగించినా స్పందన కరువు



బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): వాహనాల నెంబర్లు ఎవరికి వారు ఇష్టారాజ్యంగా అమర్చుకునే విధానానికి రవాణా శాఖ చెక్ పెట్టింది. ద్విచక్రవాహనం నుంచి ఆటోలు, కార్లతోపాటు భారీ వాహనాలు సైతం ఒకే విధమైన నెంబర్‌ప్లేట్ ఉండేలా దేశవ్యాప్తంగా ఒక నిబంధన తీసుకొచ్చారు. గతంలో వాహనాల నెంబర్లు వారికి తోచినరీతిలో పెయింటింగ్ చేయించేవారు. నెంబరు కంటే ఇతరత్రా రాతలే వాహన ప్లేట్‌లో ఎక్కువగా ఉండేవి. దీంతో సడలించిన తర్వాత కేవలం నెంబరు ప్లేట్ మాత్రమే వచ్చాయి. అయినా నెంబరు ప్లేట్ సైజ్‌లు వ్యత్యాసంగా ఉండేవి. వీటన్నింటికీ పరిష్కార మార్గంగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) లను అమలు చేయాలని తీర్మానించారు.

### కొత్త వాహనాలకు తప్పనిసరి

2019 ఏప్రిల్‌కు ముందు కొనుగోలు చేసిన వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ నెంబర్లు అమర్చాలని ఆదేశించారు. 2019 తర్వాత కొనుగోలు చేసిన వాహనాలకు నేరుగా సంబంధిత షోరూంల ద్వారా హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లను సమకూరుస్తున్నారు. 1950 నుంచి రవాణాశాఖలో రిజిస్ట్రేషన్‌ల సమాచారం ప్రకారం 2019 నాటికి రాష్ట్రంలో 2.45 కోట్ల వాహనాలు ఉన్నాయి. 2019 నుంచి 15ఏళ్ల వెనుకకు పరిశీలిస్తే 2 కోట్ల వాహనాలు మనుగడలో ఉన్నాయి. వాటన్నింటికీ హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లు తప్పనిసరిగా అమర్చాలనే నిబంధన ఉంది. ప్రజల ప్రయోజనార్థం రవాణాశాఖ హెచ్చరిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు.









రవాణాశాఖ అందిస్తున్న నంబర్ ప్లేట్లు

**జిల్లాల వారీగా హెచ్ఎస్ఆర్‌పీ పూర్తయిన వాహనాలు**

| జిల్లా | వాహనాలు | జిల్లా | వాహనాలు |
|---|---|---|---|
| బెంగళూరు నగర | 24,77,653 | ఉత్తరకన్నడ | 1,51,553 |
| బెంగళూరు గ్రామీణ | 43,193 | చిక్కమగళూర | 1,04,267 |
| మైసూరు | 4,07,830 | ఉడుపి | 1,31,713 |
| కారవార | 1,49,084 | దావణగెరె | 1,44,793 |
| దక్షిణకన్నడ | 2,76,014 | చిత్రదుర్గ | 77,384 |
| బెళగావి | 2,61,807 | శివమొగ్గ | 2,06,812 |
| కలబురగి | 80,808 | హావేరి | 84,011 |
| కోలారు | 5,64,899 | విజయపుర | 90,387 |
| హొస్పేట | 27,499 | బాగల్కోట | 91,657 |
| తుమకూరు | 1,84,318 | గదగ్ | 36,682 |
| రామనగర | 46,530 | బీదర్ | 36,545 |
| చిక్కబళ్ళాపుర | 44,157 | యాదగిరి | 19,896 |
| మండ్య | 1,12,472 | రాయచూరు | 55,378 |
| హాసన్ | 1,21,731 | కొప్పళ | 69,080 |
| చామరాజనగర్ | 45,320 | బళ్ళారి | 42,324 |
| కొడగు | 43,163 | మొత్తం | 57,20,550 |


### చేరువకాని లక్ష్యం

2023 ఆగస్టు 18 నుంచి 2025 ఫిబ్రవరి ఆఖరుకు 58,12,207 వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లకోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 57,20,550 వాహనాలకు నెంబరు ప్లేట్లను అమర్చారు. మొత్తంగా రాష్ట్రంలోని వాహనాలను పరిశీలిస్తే 29శాతం వాహనాలకు మాత్రమే హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లు అమర్చారు. బెంగళూరు నగర జిల్లాలో అత్యధికంగా 24 లక్షల వాహనాలకు నెంబర్ ప్లేట్లు అమర్చారు. 14 జిల్లాల్లో లక్ష పరిమితి దాటగా మిగిలిన జిల్లాల్లో అంతకులోపుగానే ఉన్నాయి. గతంలో విధించిన గడువు మార్చి ఆఖరుతో ముగిసింది. మరోసారి గడువు పెంచాలని ప్రభుత్వానికి రవాణాశాఖ అధికారులు ప్రస్తావనలు పంపారు. ఇంకా పరిశీలనదశలో ఉంది.

### గడువు పొడిగించినా స్పందన కరువు

గడువు పొడిగించకపోతే రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా కార్యాచరణకు సిద్ధమవుతారు. 2019 నిబంధనల ప్రకారం హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్ లేకుండా తొలిసారి పట్టుబడితే రూ.500 జరిమానా, అంతకుమించి పట్టుబడితే వెయ్యి రూపాయల జరిమానా విధించేలా రవాణాశాఖ నిబంధనలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 4వేలకుపైగా హెచ్ఎస్ఆర్‌పీ డీలర్‌పాయింట్లను రవాణాశాఖ గుర్తించింది. నిర్దిష్ట నిబంధనలు అమలు చేసేలా నెంబరు ప్లేట్లను రూపొందిస్తున్నందున రవాణాశాఖ గుర్తించిన డీలర్ పాయింట్‌ల వద్దనే హెచ్ఎస్ఆర్‌పీ నెంబరు ప్లేట్లను అమర్చుకోవాల్సి ఉంటుంది. గతంలో మాదిరి పెయింటింగ్, స్టిక్కర్ రూపంలో వేసుకునే నెంబరు ప్లేట్లకు గుర్తింపు ఉండదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతానికి 2కోట్లకుపైగా వాహనాలు ఉన్నాయి. 15ఏళ్ల పైబడిన వాహనాలకు ఎఫ్‌సీ చేయించుకోవడం కానీ, గుజరీకి పంపాలనే నిబంధన ఉంది. 2019కి ముందు కొనుగోలు చేసిన వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్‌లు అమర్చుకునే విషయంలో రవాణా శాఖ నిబంధనలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు రవాణాశాఖ ఏడు సార్లు హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లు అమర్చుకునే విషయంలో గడువు పొడిగిస్తూ వచ్చింది.

మార్చికి ముందే గడువు పెంచిన అధికారులు మరోసారి ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచేది లేదని ప్రకటించారు. అయినా వాహనదారుల్లో ఉత్సాహం మాత్రం పెరగలేదు. గడువు పొడిగించకపోతే రవాణా, ట్రాఫిక్ విభాగాలు రోడ్డెక్కితే రోజూ లక్షల్లో జరిమానాలు విధించే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి నాటికి హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాల వివరాలు ఇలా ఉన్నాయి.



నంబర్ ప్లేట్ అమరుస్తున్న రవాణా సిబ్బంది

# ఘొల్లుమంటున్న మల్లె రైతు..!

- తగ్గిన హడగలి రకం ధరలు
- ఆందోళనలో రైతులు



విరగ్గాసిన మల్లెపూలు

బళ్లారి గాంధీనగర్, మే 11(ఆంధ్రజ్యోతి): సంవత్సరంలో అన్ని సీజన్‌లలో మల్లెపూలకు డిమాండ్ ఉంటుంది. అందులో ఎక్కువగా వేసవిలో పండించే మల్లెకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఎక్కువగా అధికంగా సాగు చేస్తున్నారు. అయితే ఇటీవల మార్కెట్‌లో మల్లె ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విజయనగర జిల్లా పరిధిలోని హూవిన హడగలి తాలూకాలో ఎక్కువగా మల్లె సాగుపైనే ఆధారడ్డారు. మార్చి నెలలో ప్రారంభమైన సీజన్‌లో కిలో మల్లెపూలు రూ.500 ధర పలకగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ 250కు పడిపోయింది. గత వారం నుంచి దావణగెర, హావేరి మార్కెట్ లో పూలమార్కెట్‌లో కిలో మల్లెధర రూ 100 నుండి రూ 80లకు పడిపోవడంతో రైతులకు మరింద ఆవేదన తప్పడం లేదు. తాలూకా పరిధిలోని పట్టణసేరి హనకనహళ్ళి, దేవనగొండనహళ్ళి, మీర్యాకూరనహళ్ళి, వినోబనగర్, హోల్, తిమలాపుర, ముదేనూరు, కొంబళి గ్రామాల పరిధిలో 180 ఎకరాల్లో రైతులు మల్లె సాగు చేశారు. దావణగెర, హావేరి, గదగ్, హుబ్లీ తదితర నగరాలకు రోజూ 25క్వింటాళ్ళ నుంచి 30క్వింటాళ్ళ వరకు మల్లె మొగ్గలు రవాణా చేస్తుంటారు. ప్రస్తుతం దావణగెర, హావేరిలో పూలమార్కెట్‌లో దళారులు అధికం కావడంతో ఇష్టానుసారం ధరల నిర్ణయిస్తున్నారు. దీంతో మల్లెరైతు తీవ్ర నష్టాల పాలవుతున్నారన్నారు. కనీసం మార్కెట్‌కు తరలించే ఖర్చులకు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఎండల కారణంగా మల్లె దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంది. బెంగళూరు నుంచి గుండుమల్లె, చేమంతి రకరకాల పూలు మార్కెట్‌కు వస్తుండడంతో హడగలి మల్లె మొగ్గలకు డిమాండ్ తగ్గిందని వ్యాపారులు దావల్ మల్లిక్, సుభాన్ సాబ్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కిలో మొగ్గలు కోయడానికి కూలీలకు రూ.100 ఇస్తున్నట్లు, దళారీలు రూ.30 నుంచి రూ.40 తీసుకుంటున్నారని దీంతో చేతికందేది తక్కువేనని వినోబనగరకు చెందిన రైతు, గోనాళ మహంతేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోసిన మల్లెలను చూపుతున్న మహిళా రైతు

## యుద్ధ విరామం ఎందుకో?: మంత్రి గుండూరావ్



బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలకు దీటుగా సమాధానం చెప్పేలా సైనికులు పోరాడుతున్న తరుణంలో కదన విరామ ఆకస్మిక నిర్ణయం ఎందుకో అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు విచారం వ్యక్తం చేశారు. కదన విరామం విషయాన్ని రెండు దేశాలు అంగీకరించాయని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం విచారకరమన్నారు. ఈమేరకు ఎక్స్ ద్వారా ఆదివారం ఆయన అభిప్రాయపడ్డారు జమ్ము కశ్మీర్‌లో పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా తలదాచుకున్నారని, పాకిస్థాన్‌పై భారత్ దాడులు నిర్ణయాత్మకమైన ఫలితాలదశకు చేరలేదన్నారు. ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను రక్షిస్తోందని, భారత్ చర్యలకు అంతర్జాతీయంగా బలం లేదని చూపుతోందన్నారు. పాకిస్థాన్, చైనాలు మనకు వ్యతిరేకంగా ఒక్కటయ్యాయని, బంగ్లాదేశ్‌తోనూ సంబంధాలు బాగాలేవని, నేపాల్ మనకు మిత్రదేశం కాదని, భూటాన్ కూడా తటస్థంగా ఉందన్నారు. చర్చించాల్సిన విషయాలు చాలా ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యవసరంగా ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు జరపడం, ప్రతిపక్షాలతో చర్చలు జరపడం, జాతిని విశ్వాసంలోకి తీసుకోవడం అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

### అమెరికాకో న్యాయం... మనకో న్యాయమా..?

**: నటుడు ప్రకాశ్‌రాజ్**

భారత్ - పాకిస్థాన్‌ల మధ్య కదన విరామంపై విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికాకు ఓ న్యాయం... మనకు మరో న్యాయమా అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పాకిస్థాన్‌లోకి దూసుకెళ్లి ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టి అమెరికా యుద్ధం పూర్తి చేసిందని, అయితే మన పోరాటానికి విరామం ప్రకటించడం ఎందుకో అని పోస్ట్‌లో పేర్కొన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1585.89 | 1,577.65 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 1, 640 | 0 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 280 | 12 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 7.92 | 3.43 |

## అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న అంబులెన్స్

బళ్లారిరూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ గాయపడ్డారు. బళ్లారి రూరల్ పరిధిలోని అనంతపురం రోడ్డు జోళదరాశి మారెమ్మ దేవస్థానం సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదం జరిగింది. చెన్నై నుంచి వస్తున్న అంబులెన్స్‌ను బళ్లారి వైపు నుంచి గుంతకల్లు వైపు వెళుతున్న లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్ అదుపు తప్పి రోడ్డు పక్కకు పడిపోయింది. బళ్లారి కప్పగల్లుకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ ప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గాయపడ్డ డ్రైవర్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



గాయపడ్డ డ్రైవర్

## పోలీసులకు పట్టుబడిన దొంగ

● రూ.8లక్షల ఆభరణాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

రాయచూరు, మే 11(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఇళ్లల్లో దొంగతనాలు చేసి కొన్నాళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడు ఆదివారం జిల్లా పోలీసులకు పట్టుబడ్డాడు. జిల్లాలోని లింగసుగూరు తాలూకా గురుగుంటాలో విరుపాక్షప్ప ఇంట్లో రెండు నెలల క్రితం దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో తాళం విరగొట్టి ఇంట్లోకి చొరబడిన నిందితుడు ఇంట్లో ఉన్న రూ.80 వేలు నగదు, రెండు తులాల, బంగారు,వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుతుడిచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లాలోని హట్టి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి ప్రత్యేక బృందం అధికారులు దర్యాప్తు చేపట్టగా శనివారం గురుగుంటా సమీపంలో యువకుడొకరు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పట్టుకున్న పోలీసులు అతడిని విచారించగా గురుగుంటలో చేసిన దొంగతనంతో పాటు బాగలకోట జిల్లా ఇళకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరో ఇంట్లో దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద రూ.8 లక్షలకు పైగా విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని న్యాయస్థానానికి అప్పగిస్తున్నట్లు ప్రకటించారు.

# పాఠశాలల మూసివేత తగదు: ఏఐఎస్‌సీ




మాట్లాడుతున్న ఏఐఎస్‌సీ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ

బళ్లారి సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం తగదని ఏఐఎస్‌సీ జిల్లా అధ్యక్షుడు ఆర్.సోమశేఖర్‌గౌడ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని కాటిగుడ్డ ప్రాంతంలోని ఆంజనేయ ఆలయం సమీపంలో ఏఐడీఎస్‌ఓ, ఏఐఎస్‌సీ ఆధ్వర్యంలో ఆరు వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించకుండా, తక్కువ సంఖ్యలో విద్యార్థుల నమోదు పేరుతో పాఠశాలలను మూసివేస్తే ఎందరో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారన్నారు. ప్రభుత్వం అశాస్త్రీయ, అప్రజాస్వామిక ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. ఏఐడీఎస్‌ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో 171 పాఠశాలలను మూసివేయడానికి అధికారులు సిద్ధమవుతు న్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థుల ఆశాకిరణమని, కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులైన పాఠశాలలను మూసివేయాలన్న ఆలోచన మాను కోవాలన్నారు. రాష్ట్రంలో 6000వేలకు పైగా సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. 3500కిపైగా పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు లేదా తాగునీటి సౌకర్యాలు లేవన్నారు. చాలా పాఠశాలల భవనాలకు సంవత్సరాలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో, వాటిపైకప్పులు లీక్ అవుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 59,000 కంటే ఎక్కువ బోధనా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 29,000వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలు పతనం అంచున ఉన్నాయన్నారు. మరమ్మతులు, ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఈసీ జిల్లా కార్యదర్శి నాగరత్న , ఏఐడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతి, విద్యార్థులు మణికంఠ, ఐశ్వర్య, నళిని,పరిశోధకులు ఈరమ్మ, శారద, దుర్గమ్మ, నాగవేణి పాల్గొన్నారు.

## శౌచాలయం లేక మహిళలకు ఇబ్బందులు



నిత్యం రద్దీగా ఉండే కుడితిని వీధులు

కంప్లి, మే 11(ఆంధ్రజ్యోతి): కుడితిని అనగానే కర్మాగారాల పట్టణంగా పేరుగాంచింది. పట్టణం చుట్టూ సుమారు 20కు పైగా కర్మాగారాలు వుండటంతో ఈ పట్టణానికి ఎంతోమంది కార్మికులు తమకు కావాల్సినవి కొనుగోలు చేయడానికి వస్తూ వెళుతుంటారు. అన్నిటికీ అనుకూలంగా ఈ పట్టణంలో కనీస సౌకర్యాలపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. పట్టణానికి వచ్చే మహిళలకు ప్రభుత్వం శౌచాలయాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలుగా ఆంజనేయ స్వామి దేవస్థానం కురుగోడు రోడ్డు ఈ పరిధిలో శౌచాలయం ఏర్పాటు చేసినట్లయితే ఎంతో మేలు చేసిన వారవుతారని మహిళలు కోరుతున్నారు.

### మహిళల సమస్యలపై దృష్టి పెట్టాలి

అమ్మసంస్థ వ్యవస్థాపకులు రుద్రగౌడ మాట్లాడుతూ పట్టణంలో అన్ని సౌకర్యాలు ఉన్నాపట్టణానికి వచ్చే మహిళలకు సరైన శౌచాలయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో పట్టణ పంచాయతీ స్థలాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో ఒకట్రెండు శౌచాలయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని అతి ఎక్కువగా రెవెన్యూ పట్టణంగా ఉన్న సౌకర్యాలు లేక పట్టణానికి వచ్చే ప్రజలు, మహిళలు ఇబ్బందులు గురవుతున్నారు.



అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు రుద్రగౌడ

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కమలాపూర్‌లోని కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులకు ఆదివారం ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అమృత్ 2.0 ప్రాజెక్ట్ కింద తాగునీటి సరఫరా యూనిట్ ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో ఫీడర్ ప్రధాన పైప్‌లైన్ నిర్మాణం, 10లక్షల లీటర్ల సామర్థ్యంతో ఎగువ నీటి నిల్వ ట్యాంక్ నిర్మాణం, 6199 కిలోమీటర్ల పంపిణీ నెట్‌వర్క్, పట్టణంలోని దాదాపు6000 ఇళ్లకు నీటి కనెక్షన్‌లను అందిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న 4.54ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటిశుద్ధీ కర్మాగారాన్ని పునరుద్ధరిస్తామన్నారు. మొత్తం రూ. 26.17కోట్ల వ్యయంతో పనులు చేపడ్తామన్నారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కమలాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో 2 చెత్త వాహనాలు, 1జేసీబీ యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, సభ్యులు ముక్తిబార్ బాషా, నామినేటెడ్ సభ్యులు సోమశేఖర్, నాయకులు ఖాజా హుస్సేన్, ముఖ్య అధికారి ఈరన్న పాల్గొన్నారు.

# పదవులకు న్యాయం చేయాలి: ఎమ్మెల్యే గణేష్



కేంద్ర దిశ సమితి సభ్యుడు ఏసీ దానప్పను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు ఇచ్చిన సదుపాయాలను సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఆదివారం కంప్లి పట్టణంలో ఏసీ దానప్ప కుటుంబీకులు, సంగాత్ర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. ఏసీ దానప్పకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ దిశా సమితి సభ్యుడిగా ఎన్నిక కావడంతో వారిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు పొందిన వారు పూర్తి న్యాయం చేయాలన్నారు. ఏసీ దానప్ప మాట్లాడుతూ తమపై కేంద్ర ప్రభుత్వం నమ్మకం వుంచి ఈ హోదా కల్పించింది. ప్రజలకు సేవలు అందించి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. కార్యక్రమంలో ఉలిగమ్మ రాష్ట్ర పోలీసు శాఖ ఫిర్యాదుల ప్రాధికార సభ్యుడు మోహన్‌కుమార్ దానప్ప, మనోజ్‌కుమార్ దానప్ప, హేమంత్‌కుమార్ దానప్ప, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

### సామూహిక వివాహాలను సద్వినియోగం చేసుకోండి..

గ్రామాల్లో పట్టణాల్లో సంఘసంస్థలు జరిపే సామూహిక వివాహాలను సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఆదివారం హొస్పేట బైపాస్ హిందుస్థాన్ గార్డెన్‌లో పింజరి సదాఫ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వివాహాల్లో ఐదు జంటలు ఒక్కటయ్యారు. దంపతులను ఎమ్మెల్యే గణేష్ ఆశీర్వదించారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ఒకరినొకరు అన్యోన్యంగా వుంటూ కష్టాలు ఎదుర్కొని తమ జీవనం గడిపినప్పుడే తమకు గుర్తింపు వుంటుందన్నారు. ఈ సామూహిక వివాహాలు వివిధ ప్రజలకు ఒక వరమన్నారు. ఇలాంటి వివాహం సద్వినియోగ పరచుకుని ఆర్థికంగా మెరుగుపడాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ధనికులు, పేద ప్రజలను దృష్టిలో వుంచుకుని ఇలాంటి సమాజసేవలు చేసేందుకు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో సదాఫ్ సంఘం తాలుకా అధ్యక్షుడు దాదాపీరా ముస్లిం గురువులు సయ్యద్ షా ఖాజా మోహినుద్దీన్ ఖాద్రి సయ్యద్ నూర్ ఖాద్రి, రైస్ సాహెబ్, నూర్ సాహెబ్, హబీబుర్ రెహమాన్, సీఆర్ హనుమంతు, జలీల్, అంజుమన్, కిరత్ మస్తాన్, జిలాన్, షణ్ముఖప్ప తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

## నకిలీ బంగారం కేసులో నిందితుడి అరెస్ట్

● రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బళ్లారి సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన ఒక వ్యక్తికి నకిలీ బంగారం అంటగట్టి రూ.10 లక్షల మోసానికి పాల్పడ్డ నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సండూర్ తాలూకా అంతఃపుర గ్రామానికి చెందిన నిందితుడు తిరుపతి(30) ఏపీలోని అనంతపురానికి చెందిన శివారెడ్డిని తోరణగల్లు గ్రామానికి పిలిపించి రూ.10లక్షల నగదు తీసుకుని నకిలీ బంగారం అందించారు. బంగారం నకిలీదని తెలగానే శివారెడ్డి తోరణగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పురాతన బంగారం దొరికింది. తక్కువ ధరకు అమ్ముతామని హామీ ఇచ్చి నిందితుడు శివారెడ్డిని ఉచ్చులోకి లాగినట్లు తెలుస్తోంది.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ సభ్యుడు నూర్ మహ్మద్

బళ్లారి సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని 15వ వార్డులోని వీధిలో శిథిలావస్థలో ఉన్న ప్రజారోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తున్నారు. రోడ్డు పనులను ఆదివారం కార్పొరేషన్ సభ్యుడు నూర్ మహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో 15వ వార్డు ఓటర్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. వార్డులోని అన్ని అభివృద్ధి పనుల్లో 70నుంచి 80 పూర్తి చేశామన్నారు. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి వార్డును సుందరగంగా మారుస్తామన్నారు.

## 14న ఎస్‌యూసీఐ రాష్ట్రస్థాయి ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్ గౌడ

బళ్లారి సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల పరిష్కారానికి ఎస్‌యూసీఐ 14న రాష్ట్రస్థాయి పోరాటం చేపట్టనుంది. ఆదివారం రాష్ట్రస్థాయి పోరాటంలో భాగంగా ఎస్‌యూసీఐ వీధి సమావేశాలు, ఆటో ప్రచారాలను నిర్వహించింది. ధరల పెరుగుదలను అరికట్టడానికి విద్య ,ఆరోగ్య విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ప్రచారం నిర్వహించామని ఎస్‌యూసీఐ జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ ప్రమోద్, సోమశేఖర్‌గౌడ తెలిపారు. ఆదివారం వీధి ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం వ్యతిరేక ధోరణి కారణంగా ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దీంతో సామాన్యుల బతుకు దుర్భరంగా మారిందన్నారు. గిట్టుబాటు ధరలులేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. విద్య ఆరోగ్యం పూర్తిగా వాణిజ్య వస్తువుగా మారాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడే పార్టీలుగా మారాయన్నారు. ఈనేపథ్యంలో ప్రజలను మనం సంఘటితపరిచి బలమైన పోరాటాన్ని సృష్టించాలి. ఈవ్యవస్థను కూలివేయాలన్నారు. ఈసందర్భంలో సభ్యులు సురేశ్, జగదీశ్, విద్య, శాంత, గోవింద పాల్గొన్నారు.

## గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

బళ్లారి సిటీ/రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ అఫీసర్ డాక్టర్ భారతి అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ రాజ్‌శాఖ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ , కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మోకాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తాలూకాలోని మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లికార్డు, గర్భదారణ నమోదు, గర్భధారణ టీకాలు , ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం, విరామ పద్ధతులు, కిల్కారీ కాల్ మొబైల్ హెల్త్ సర్వీస్, ప్రసనానికి సిద్ధం కావడానికి అవసరమైన పూర్తి సమాచారం గురించి సమాచారం అందించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విద్యాధికారిణి ఖుర్షీద్ బేగం,పీఎంఎస్ఎంఏ కార్యక్రమం యొక్క ఉద్దేశమని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిప్పేస్వామి, సీనియర్ ప్రైమరీ సేఫ్టీ ఆఫీసర్ ఎర్రమ్మ, చంద్రమ్మ, వైద్య సిబ్బంది , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా తాయమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న హాలవి అభినవ మహంత స్వాములు

సిరుగుప్ప, మే 11 (ఆంధ్రజ్యోతి) : హాలవి అభినవ మహంత స్వామి ఆధ్వర్యంలో తాయమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. సిరుగుప్ప తాలుకాలోని భాగవడే గ్రామంలో నూతనంగా నిర్మాణం చెందిన తాయమ్మ దేవి ఆలయంలో వేదపండితులు, వివిధ ధార్మిక కార్యక్రమాలు, హోమాలు చేపట్టిన విగ్రహ ప్రతిష్టాపన చేశారు. హాలివి అభినవ మహంత స్వాములు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చొక్కా బసవనగౌడ, బసవ భూషణ స్వామి, హాళేకోట మల్లికార్జునస్వామి, ఆలయ నిర్మాణానికి సహకరించిన పిచ్చేశ్వరరావు, హనుమంతప్ప కుటుంబ సభ్యులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

### రెండు బైక్‌లు ఢీకొని మహిళ మృతి

రాయచూరు, మే 11(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృత్యువాత పడింది. ఆదివారం జిల్లాలోని సింధనూరు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సింధనూరు తాలూకా హత్తిగుడ్డ గ్రామానికి చెందిన బైరమ్మ(40) తన భర్తతో కలిసి బైక్ పై వెళుతుండగా భోగపూర్ దారిలో వెనకి నుంచి వస్తున్న మరో మోటర్ బైక్ ఢీ కొనడంతో బైరమ్మ బైక్ పై నుంచి కింద పడి తీవ్రగాయాలపాలయ్యింఇ. చికిత్స కోసం ఆమెను తుర్విహాళ్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సింధనూరు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందింది. తుర్విహాళ్ పట్టణ ఎస్ఐ సుజాతానాయక్ ఆస్పత్రికి వెళ్లి మృతురాలు భర్త శరణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# హోసూరు జోన్

## వైభవంగా కైవార తాతయ్య ఆరాధన మహోత్సవం



వేదికపై బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వాములు

హోసూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాగలూరు రోడ్డులోగల సద్గురు కైవార నారేయణ తాతయ్య ఆశ్రమ 46వ వార్షిక పూజ, 190వ వార్షిక ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు కొనసాగాయి. ముఖ్యఅతిథిగా బెంగళూరు జయనగర్ లోకసిద్ధారూఢ మఠానికి చెందిన సిద్ధలింగేశ్వర స్వామిజీ పాల్గొన్నారు. సుప్రభాత, ప్రణవ పతాకావిష్కరణ, కళశస్థాపన, గణపతి హోమం, నవగ్రహ హోమం, అభిషేక పూజలు జరిగాయి. ఆశ్రమ సంస్థాపకులు బ్రహ్మశ్రీ వేంకటేశ్వర స్వాములు భక్తులను ఆశీర్వచనం చేశారు. తపోవన ముఖ్యులు ఎన్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. విశేషపూజలు, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ నిర్వహించారు. హోసూరు, డెంకణీకోట, శూలగిరి, ఆనేకల్, మాలూరు, బెంగళూరు దక్షిణ తాలూకా తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## సమ్మెపై సన్నాహక సభ




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20న అఖిలభారత స్థాయిలో అన్ని కార్మికసంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెపై సన్నాహకసభ నిర్వహించారు. హోసూరు నగరం డెంకణీకోట రోడ్డులోని ప్రైవేట్‌హాల్‌లో సమావేశం జరిగింది. జిల్లా కౌన్సిల్ కార్యదర్శి గోపాలకృష్ణన్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీధరన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు మదయ్యన్, కుమరేశన్, ఇలంగోవన్ అధ్యక్షత వహించారు. హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ పాల్గొని ప్రసంగిస్తూ కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిప్‌కాట్ ప్రారంభించబడిందన్నారు. వెయ్యికిపైగా ఫ్యాక్టరీలు తలెత్తడంతో లక్షలాదిమందికి కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అనేక దేశాలను పర్యటించి పెట్టుబడులు తెచ్చి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పరిశ్రమలు స్థాపించాలని యోచిస్తున్నారన్నారు. కార్మికులపై కేంద్రప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెస్తోందన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకోసం తమిళనాడు ప్రభుత్వం పోరాటం చేస్తోందన్నారు. సమావేశంలో కృష్ణగిరి ఎంపీ గోపినాథ్, ఐఎన్‌టీయూసీ అఖిలభారత కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే మనోహరన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజన్ పాల్గొన్నారు.

## పశువుల సంతలో సౌకర్యాల కొరత

హోసూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కెలమంగలం బస్టాండ్ వెనుక సుమారు 9 ఎకరాలలో పశువుల మార్కెట్ ఉంది. ఇక్కడ ప్రతి ఆదివారం పశువుల సంత నిర్వహిస్తారు. కృష్ణగిరి, ధర్మపురి జిల్లాలతోపాటు సరిహద్దులోని కర్ణాటక ప్రాంతాలనుంచి కూడా పశువులు, మేకలు, కోళ్లు అమ్మకానికి వస్తాయి. ప్రజాదరణ పొందిన కెలమంగలం వారపు సంత ప్రదేశం ఆక్రమణలకు గురై రానురాను 2 ఎకరాలకు కుదించబబడింది. ప్రతివారం లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నా ఇక్కడ పశువులతోపాటు వచ్చిన రైతులు, దళారులకు తాగునీరు సదుపాయం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సీజన్‌లో రూ.1కోటి నుంచి 4 కోట్ల రూపాయలదాకా వ్యాపారం సాగుతుంది. మార్కెట్‌కు వచ్చే ప్రతి ఆవుకు 100 రూపాయలు గేట్ వసూలు చేస్తారు. అయినా పశువులకు తాగునీటి తొట్టెలు, ఇంకా శౌచాలయం ఇతరత్రా సదుపాయాలు లేవు. మార్కెట్‌లో కనీస సదుపాయాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వారపుసంతలో అమ్మకానికి ఉన్న పశువులు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

### గౌతమ బుద్ధుడు (జయంతి)



బుద్ధ పూర్ణిమ అనేది గౌతమ బుద్ధుడి జననం, జ్ఞానోదయం, మహాసమాధిని స్మరించే పౌర్ణమి రోజు. ఇది వైశాఖ మాసంలో వస్తుంది. గౌతమబుద్ధుడు ఒక తత్వవేత్త, ఆధ్యాత్మిక గురువు. ప్రాచీన భారతదేశంలో క్రీస్తుపూర్వం 5 నుంచి 4 శతాబ్దం వరకు నివసించినట్లు చరిత్రద్వారా తెలుస్తోంది. బౌద్ధమత సంస్థాపకులుగా గౌరవించబడుతున్నారు. నేటికీ చాలా బౌద్ధ పాఠశాలలు జ్ఞానోదయం పొందిన వ్యక్తిగా గుర్తిస్తున్నాయి. 80వ యేట నిర్యాణం చెందారు.

### ఫ్లోరెన్స్ నైటింగేల్ (జయంతి)



'లేడీ విత్ ది ల్యాంప్' గా పేరొందిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820 మే 12న ఇటలీ దేశంలో జన్మించారు. సమాజ సేవకురాలు, నర్సు. రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యము. ఆమె చేసిన సేవల వల్ల మరణించే రోగుల సంఖ్య కూడా బాగా తగ్గింది. యుద్ధంలో దెబ్బతిన్న ప్రతి సైనికుడికి తాను బ్రతుకుతాను అన్న ఆశ చిగురించేది. 1860 జూన్ 24న 'నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఆఫ్ నర్సెస్'ను స్థాపించారు. ఆమె భారతదేశానికి కూడా ఇతోధిక సేవలందించారు. 1910 ఆగస్టు 13న కన్నుమూశారు.

### అనసూయాదేవి (జయంతి)



రేడియో వ్యాఖ్యాత, 'కళాప్రపూర్ణ' అవసరాల (వింజమూరి) అనసూయాదేవి 1920 మే 12న కాకినాడలో జన్మించారు. ప్రముఖ జానపద కళాకారిణి, దక్షిణభారత తొలి మహిళా సంగీత దర్శకురాలు, రచయిత. హార్మోనియం వాయించటంలో దిట్ట. 8ఏళ్లకే ఆమె పాట రికార్డు అయ్యింది. ఈమె మేనమామ దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన ప్రముఖ దేశభక్తి గీతం 'జయజయ జయ ప్రియ భారత' పాటకు బాణీ కట్టారు. దేశంలో జానపద గేయాలకు సినీ జగత్తులో వన్నె తేవడమే కాక, కర్ణాటక బాణీలో స్వరపరిచిన తొలి స్వరకర్త. విశ్వవిద్యాలయాలలో శాస్త్రీయ సంగీతాన్ని పాఠ్యాంశంగా చేర్పించిన అసమాన గాయని. ప్రపంచవ్యాప్తంగా 11 జీవితసాఫల్య పురస్కారాలు పొందారు. 2019 మార్చి 23న కన్నుమూశారు.

### షేక్ చిన మౌలానా (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత డాక్టర్ షేక్ చిన మౌలానా 1924 మే 12న ప్రకాశం జిల్లా కరవది గ్రామంలో జన్మిం చారు. పూర్వీకులు గుంటూరు జిల్లా వాసులు. చిన్నతనంలో షేక్ ఆదమ్ సాహెబ్ వద్ద నాదస్వర వాదనలో శిష్యరికం పొందారు. దురైకణ్ణు పిళ్ళై వద్ద ఆరితేరారు. శ్రీరంగం ఆలయంలో ఆస్థాన విద్వాంసుడిగా వ్యవహరించారు. సుబ్రమణ్యస్వామి భక్తుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయ చాన్స్‌లర్‌గా వ్యవహరించినప్పుడు అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ నుంచి 1985లో 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కారం అందుకున్నారు. సంగీత కళానిధి తదితర పురస్కారాలు పొందారు. 1999 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

### జనార్దన్ మిట్టా (పుట్టినరోజు)



పండిట్ జనార్దన్ మిట్టా 1934 మే 12న జన్మించారు. చెన్నైకు చెందిన ఆయన సితార్ కళాకారుడిగా పేరొందారు. ఆలిండియా రేడియోలో పనిచేశారు. దేశ విదేశాలలో పర్యటించి సంగీతంపై అవగాహన కల్పించి, మెళకువలు నేర్పించారు. ఐక్య రాజ్య సమితిలోనూ సంగీత కచేరీ ప్రదర్శించారు. చెన్నైలో సినీరంగంలో దశాబ్దాలపాటు సితార్ కళాకారుడిగా సేవలందించారు. చెన్నైలోని అమీర్ ఖుస్రో సంగీత అకాడమీ నుంచి జీవితసాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు.

# బాగేపల్లిలో ఘనంగా కరగ మహోత్సవం



పురవీధుల్లో కరగను ఊరేగిస్తున్న దృశ్యం

బాగేపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత గంగమ్మదేవి సన్నిధిలో ధర్మరాయస్వామి 36వ వార్షిక కరగ మహోత్సవం వైభవంగా జరిగింది. గంగమ్మదేవి ట్రస్టు, కరగ మహోత్సవ సమితి నేతృత్వంలో ఉత్సవాలు సాగాయి. మేలూరుకు చెందిన ధర్మేంద్ర కరగను ధరించగా వీరకుమారులు వెంటరాగా ఊరేగారు. గంగమ్మ దేవికి విశేషపూజలు, మహామంగళారతి అనంతరం కరగను ధరించారు. వీరకుమారులు గోవిందా... గోవిందా... అంటూ నామస్మరణ చేస్తూ ఖడ్గాలను ఝళిపిస్తూ కరగను స్వాగతించారు. ఆలయం నుంచి భక్తుల నడుమ కరగ ఊరేగింపు కొనసాగింది. పట్టణంలోని కేఈబీ కాలనీ, కుంబారపేట, గూళూరు రోడ్డు, కొత్తపల్లి దర్గా మొహల్లా తదితర లే అవుట్‌లలో భక్తుల పూజలు అందుకుంది. మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులు వేసి కరగను స్వాగతించారు. సరిహద్దు ప్రాంతాలతోపాటు చిక్కబళ్ళాపుర, కోలారు జిల్లాలనుంచి సుమారు 50వేలమంది భక్తులు పాల్గొని కరగను వీక్షించారు. ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిరాజు నేతృత్వంలో సుమారు 40వేలమందికి తట్ట ఇడ్లి, రైస్‌బాత్‌ను ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈసారి ఊహించినదానికంటే భక్తులు భారీసంఖ్యలో వచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ప్రశాంత్‌వర్ధి నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, కరగ సమితి సభ్యులు బీఆర్ నరసింహనాయుడు, ఏజీ సుధాకర్, సీఎస్ వెంకటేశ్, మరియప్ప, సూర్యనారాయణరెడ్డి, ఆదిమూర్తి, గడ్డం నరసప్ప, బైయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సముచిత స్థానం కల్పించాలని కోరతా...



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ

శిడ్లఘట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి): గత ఎంపీ ఎన్నికల వేళ బీజేపీ, జేడీఎస్ పొత్తు కారణంగా తనకు, తన మద్దతుదారులకు పార్టీలో తగిన అవకాశాలు దక్కలేదని ఈ అంశంపై పార్టీ హైకమాండ్‌కు విన్నవించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఎం రాజణ్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలో ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ తాను, తన అనుచరులు గత శాసనసభ ఎన్నికల్లో బీజేపీలో చేరామన్నారు. పార్టీ బలోపేతం చేయడంతోపాటు పలు గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేసినట్టు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ, జేడీఎస్ మైత్రి అనంతరం మాజీ ఎమ్మెల్యే అయిన తనకు, తనతోపాటు చేరినవారికి ఎన్డీయే నాయకులు నిర్లక్ష్యం చేశారన్నారు. పార్టీలో తనకు సముచిత స్థానం లేదని, బాధ్యత ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కారణంగానే తాను పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనలేదన్నారు. దీనిపై పార్టీనేతలతో చర్చించాలంటూ మద్దతుదారుల నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. సభలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారన్నారు. పార్టీలో చిన్నా చితకా బేధాభిప్రాయాలను, సమస్యలను ఎంపీ డాక్టర్ కే సుధాకర్‌కు త్వరలోనే వివరిస్తానన్నారు. ఇటీవల ఒక ప్రైవేట్ కార్యక్రమంలో భేటీ అయినవేళ పార్టీకి దూరంగా ఉంటున్నాననే విషయాన్ని ప్రస్తావించారన్నారు. ఈ నేపథ్యంలో అభిమానులు, మద్దతుదారులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలను ఆలకించి ఎంపీ సుధాకర్‌కు వివరిస్తానన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు హైస్కూల్ దేవరాజ్, కనక ప్రసాద్, అశ్వత్థప్ప, దొణ్ణల్లి రామణ్ణ తదితరులు పాల్గొన్నారు.

# సైన్యానికి మద్దతుగా వాకథాన్

జాలహళ్ళి, మే 11(ఆంధ్రజ్యోతి): భారతీయ సైన్యానికి మద్దతుగా విద్యారణ్యపుర నుంచి సహకారనగర్ దాకా వాక్ ఫర్ ది నేషన్ పేరిట ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి వాకథాన్‌ను ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తమ్మేశ్‌గౌడ నేతృత్వంలో ఏర్పాటైన వాకథాన్‌లో వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. సైనికులకు అండగా ఉంటామని నినాదాలు చేశారు.



వాకథాన్‌లో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె తదితరులు

# సేవతోనే జీవితానికి సార్థకత



రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామీజీ తదితరులు

ముళబాగిలు, మే 11 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవనం సార్థకత కావాలంటే సమాజ సేవ చేయాలని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామిజీ అభిప్రాయపడ్డారు. లోకకల్యాణం కోసం శ్రీపాదరాజ మఠం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాదరాజమఠం వైభవోత్సవం కార్యక్రమాలు ఒక నెలరోజులపాటు అర్థపూర్ణంగా నిర్వహించేలా చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణ శివారులోని నరసింహతీర్థ పాదరాజమఠంలో ఏర్పాటు చేసిన పాదరాజ వైభవోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమాజసేవ చేయడంతో నవసమాజ నిర్మాణం సాధ్యమన్నారు. హరిదాస సాహిత్యంకోసం శ్రమిస్తున్న శ్రీపాదరాజమఠం పాత్ర కీలకమన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక మఠాధిపతులు ధార్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఒకనెలపాటు కాలజ్ఞానయజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. హిందూధర్మం అత్యంత ప్రాచీనమైనదన్నారు. తొలుత పీఠాధిపతులు పాదరాజ బృందావనం, నరసింహస్వామి, ఆంజనేయ స్వామిలకు పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీపాదరాజమఠం మఠాధిపతి సుజయనిధి తీర్థస్వామిజీ, శిరూరుమఠం మఠాధిపతి, వేదవర్ధన తీర్థ స్వామిజీ, సోసలె వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్యాశ్రీతీర్థస్వామిజీ, గోపాలచార్, మఠం విద్వాన్ చతుర్వేది వేదవ్యాస ఆచార్, సుదర్శన్, ప్రసన్న, హెచ్‌ఎస్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సంస్కృత శిబిరం



సంస్కృత సంభాషణా శిబిరంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


చింతామణి, మే 11 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భారతి ఆధ్వర్యంలో చింతామణి తాలూకాలోని కెందనహళ్ళిలోని హరీశ్ నివాసంలో 12 రోజులపాటు సంస్కృత సంభాషణా శిబిరం విజయవంతంగా కొనసాగింది. శిబిరంలో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన ఆకట్టుకుంది. సంస్కృత సంభాషణ, గీతగాయనం, శ్లోక పఠనం వంటివి అలరించాయి. లక్ష్మీదేవనకోటె హైస్కూల్ టీచర్ మంజునాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సంస్కృత భాష దేశ సాంస్కృతిక భాషగా ఉందన్నారు. అన్ని భారతీయ భాషలలోకి అత్యధిక సంస్కృత శబ్దాలు ఉండడంతో దేశ ప్రజలను ఐకమత్యం చేస్తోందన్నారు. శిబిరం నిర్వాహకులు యువనేత హరీశ్ మాట్లాడుతూ గ్రామ వికాసం కోసం సంస్కృత సంభాషణా శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్కృతం టీచర్ రాఘవేంద్రను శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. సన్మానం స్వీకరించిన అనంతరం రాఘవేంద్ర మాట్లాడుతూ పాఠశాల సెలవురోజులను సద్వినియోగం చేసుకునేలా రోజుకు రెండు గంటలపాటు సంస్కృత సంభాషణకోసం కేటాయించడం ద్వారా విద్యార్థులు, సహకరించిన వారి తల్లిదండ్రులను ప్రశంసించారు. ముగింపు కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యుడు తిరుమలప్ప, అధ్యాపకులు డాక్టర్ కేజీ రుక్మిణి, గజేంద్ర, దీపికా హరీశ్, రూపా గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కరగ ఉత్సవానికి ఏర్పాట్లు



బంగారపేటలోని ధర్మరాయస్వామి ఆలయం

బంగారపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): వందలాది సంవత్సరాల ఇతిహాసం కలిగిన ధార్మిక ఆచరణ అయిన ఏడాదికోసారి నిర్వహించే కరగ ఉత్సవానికి వేలాదిమంది తరలివస్తారు. కరగను మోసే అర్చకుడిని సాక్షాత్తుగా దేవుడే వచ్చి ఆశీర్వదించినట్లుగా భక్తులు విశ్వసిస్తారు. వేదికపై కరగను ధరించి మైమరిపించేలాంటి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ నృత్యాన్ని చూసేందుకు సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల భక్తులు సైతం తరలి వస్తారు. బెంగళూరు కరగ మాదిరిగానే బంగారపేటలోని ద్రౌపతాంబదేవి అమ్మవారి పూల కరగ ఏడు రోజులపాటు కొనసాగనుంది. బేతమంగల ప్రసిద్ధ కరగ పూజారి కృష్ణమూర్తి కరగను ధరించి నాగిని పాము పాటకు వేసే నృత్యం ఎంతో భిన్నంగా ఉంటుంది. డప్పులు, వాద్యాలకు అనుగుణంగా నాగుపాములే నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణ. ఈసారి కరగ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ సమితి ఉపాధ్యక్షుడు చిన్ని వెంకటేశ్ తెలిపారు. ధ్వజారోహణ, హసికరగ, పూలకరగ, వసం తోత్సవం ఇలా కార్యక్రమాలు కొనసాగు తాయ న్నారు. కరగను ధరించే అర్చకులు ఎన్నో నియమ నిష్ఠలు పాటిస్తారన్నారు. కాగా ముళబాగిలు తాలూకాలో కూడా కరగ ఉత్సవం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు చేశారు.



ముళబాగిలులో అమ్మవారికి అలంకరణ

# కులగణన సర్వేలో పాల్గొనండి



కరపత్రాలతో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ తదితరులు

విజయపుర, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ కులాల వర్గీకరణ కోసం ఉద్దేశించిన సర్వే కొనసాగుతోందని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, మీ మూల కులం పేరు తప్పక నమోదు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిగుంద వెంకటేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 19వ వార్డు రాజీవ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు జిల్లాల్లో ఆది కర్ణాటక, ఆదిద్రావిడ అనే కులాలవారు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. ప్రస్తుత సర్వేలో ఎస్సీలో ఉపకులాలైన మాదిగ, హొలెయ, బోవి, లంబాణి, కొరచ, కొరమ, దక్కలిగ తదితర వర్గాలను, మూల కులాన్ని తప్పకుండా నమోదు చేయించాలన్నారు. ఈమేరకు ఆయా గ్రామాల యువతలో చైతన్యం కల్పించేలా కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం నాగ రాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాధ, తాలూకా ఉపాధ్యక్షుడు దేవరాజ్, గురుప్రసాద్, వేణుగోపాల్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లి రైతుకు ఏడుపే..!

- కిలో రూ.7 నుంచి రూ.8 మాత్రమే
- గిట్టుబాటు కాదని అన్నదాత ఆవేదన



పొలం వద్దే నిల్వ ఉంచిన ఉల్లి బస్తాలు

చేళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుకు కన్నీరే మిగిలింది. ఇన్నాళ్లు కనీసం రూ.10 పలికిన కేజీ ధర శనివారం రూ.7కు చేరడంతో అన్నదాత విలవిలలాడుతున్నారు. చేళూరు తాలూకా పరిధిలో అన్నదాతలు ఉల్లిని అధికంగా పండిస్తున్నారు. తేడాది 60 కేజీల బస్తా రూ.3వేలు ధర పలికింది. దీంతో చాలామంది రైతులు పోటీ పడి ఉల్లిని సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చాక ధర అమాంతం పడిపోయింది. శనివారం 100 కేజీల ధర రూ.700-800 మాత్రమే పలికింది. ఆశించిన ధర లభించకపోవడం, ధర ఒక్కసారిగా పడిపోవడంతో అన్నదాతలు నిరాశకు లోనయ్యారు. దీంతో పొలాల వద్దనే ఉల్లిబస్తాలు నిల్వ చేశారు. గిట్టుబాటు ధర ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

### నేడు సమారాధన

ధర్మవరంరూరల్, మే11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురంలో తిక్కయ్యస్వామికి సోమవారం సమారాధన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త తరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ పూజారి సిద్దయ్య ఆలయాన్ని శుద్ధి చేసి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు జీవసమాధి కావడంతో ఏటా మొలకలపౌర్ణమికి సమారాధన పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తోందని వారు తెలిపారు. అందులో భాగంగానే ఈ సోమవారం సమారాధన పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### కశ్మీర్‌లో చిక్కుకున్న విద్యార్థులకు

# కేంద్రమంత్రి కుమార సహకారం



విద్యార్థుల బృందం

బెంగళూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో అక్కడ విద్యాభ్యాసం చేస్తున్న రాష్ట్రానికి చెందిన 13మందిని సురక్షితంగా వాపసు రప్పించేందుకు కేంద్రమంత్రి కుమారస్వామి చొరవ చూపారు. కశ్మీర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో 13మంది రాష్ట్రానికి చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, జేడీఎస్ యువనేత నిఖిల్‌కుమార్‌కు సమాచారం ఇచ్చిన మేరకు తండ్రి, కేంద్రమంత్రి కుమారస్వామి సహకారంతో 13మందిని రాష్ట్రానికి రప్పించారు. శనివారం ఢిల్లీకి చేరుకున్న వారు ఆదివారం కర్ణాటకకు వచ్చారు. శనివారం రాత్రి పొద్దుపోయేసరికి కశ్మీర్ నుంచి రైలులో ఢిల్లీకి చేరుకున్నారు. రాత్రి కర్ణాటక భవన్‌లో బస కల్పించారు. ఆదివారం ఉదయం విమానంలో బెంగళూరుకు చేరుకున్నారు.

# లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం



బలేపేట రథోత్సవంలో భక్తులు

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బలేపేటలో కొలువైన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నృసింహ జయంతిని పురస్కరించుకుని ఆదివారం బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. ఆలయంలో విశేషపూజల అనంతరం ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

# గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి గాయాలు



సిలిండర్ పేలడంతో చెల్లాచెదురైన వస్తువులు

చింతామణి, మే 11(ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ లీకేజ్‌తో సిలిండర్ పేలిన ఘటనలో నలుగురు గాయపడిన సంఘటన చింతామణి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మురగమల్లా రోడ్డులోని కరి యపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం సుమారు 8 గంటలకు ఘటన జరిగింది. వెంకటేశ్వర పాఠశాల సమీపాన లక్ష్మీదేవమ్మ నివసిస్తున్నారు. గ్యాస్‌సిలిండర్ పేలిన ఘటనలో ఇంటి పైకప్పు దెబ్బతినడంతోపాటు కొడుకు హర్షవర్ధన్, అన్న పిల్లలు సంజయ్, హరిప్రియలు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సలు అందించారు. లక్ష్మీదేవి, హర్షవర్ధన్‌కు తీవ్రంగా కాలినగాయాలు కావడంతో వారికి ప్రాథమిక చికిత్సల అనంతరం బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. గ్యాస్ పేలుడు ధాటికి ఇంట్లోని పలువస్తువులు చెల్లాచెదురయ్యాయి. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి



గొర్రెల కళేబరాలు

బంగారపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకాలోని దేవ గానహళ్ళి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతిచెందాయి. మోహన్‌కు చెందిన పొలంలో 11కేవీ విద్యుత్‌స్తంభం వద్ద ఆదివారం మధ్యాహ్నం మేతకు వెళ్లినవేళ విద్యుత్‌షాక్ కారణంగా మృత్యువాత చెందాయి. రైతు హనుమప్పకు చెందిన గొర్రెలుగా గుర్తించారు. సుమారు 50వేల విలువైన గొర్రెలు మృతి చెందాయని వాపోయారు. తగిన పరి హారం అందించి ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న బెస్కాం జేఈ శంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పశువైద్యులు రాజన్ నేతృ త్వంలో పోస్టుమార్టం నిర్వహించారు. బంగారపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన చోటు చేసుకుంది.


జవాన్‌కు సెల్యూట్ చేస్తున్న మంత్రులు అనిత, సవిత, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పల్లె సింధూర


నివాళి అర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్


అంజలి ఘటిస్తున్న కుంటిమద్ది లక్ష్మీనారాయణ


పూలమాల వేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, చిత్రంలో గుంటూరు మేయర్ రవీంద్ర


టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, వెట్టెం వెంకటేశ్, రాయల్ మురళి


ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, శ్రీధర్ చౌదరి, రామలింగారెడ్డి


వీరజవాన్ పార్థివదేహంపై జాతీయ జెండాను కప్పుతున్న ఎమ్మెల్యే రాజు, పరిటాల శ్రీరామ్


అంజలి ఘటిస్తున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి


శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


ఎస్పీ రత్న


సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప


జవాన్ అంతిమయాత్ర

# అమరపురికి అగ్నివీరుడు

## అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు

- జనవాహిని కన్నీటితో తడిసిన కళ్లి తండా
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులు
- మురళీ నాయక్ తల్లిదండ్రులకు ఓదార్పు
- పాడె మోసి.. మట్టి ఇచ్చిన మంత్రి లోకేశ్
- మంత్రులు అనగాని, సవిత, సత్యకుమార్ నివాళి
- అంతిమయాత్రలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రముఖులు

హిందూపురం, మే 11(ఆంధ్రజ్యోతి): కళ్లి తండా కన్నీటి సంద్రమైంది. వీర జవాను నడిచిన నేల.. అతని అంతిమయాత్ర వేళ తీవ్ర భావోద్వేగానికి లోనైంది. ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీ నాయక్ అంత్యక్రియలు గోరంట్ల మండలంలోని స్వగ్రామం కళ్లి తండాలో అధికార లాంఛనాలతో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏపీ, కర్ణాటక సహా పలు ప్రాంతాల నుంచి వేలాది మంది జనం అంతిమ యాత్రలో పాల్గొని, తీవ్ర భావోద్వేగాల నడుమ అగ్ని వీరుడిని అమరపురికి సాగనంపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి అనిత, మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మాజీ సైనికులు ఘన నివాళులు అర్పించారు. తమ కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామనాయక్ గుండెలవిసేలా రోధించారు. జాతీయ జెండాను కప్పుకుని శాశ్వత నిద్రలోకి వెళ్లిన తమ గారాలపట్టిని ఆఖరిసారిగా హత్తుకుని 'లేవరా మురళీ.. నీకోసం ఎంతమంది వచ్చారో చూడు.. పవన్ కల్యాణ్ సార్ వచ్చాడు.. లేచి సెల్యూట్ చేయరా..' అని పిలుస్తూ బోరున విలపించారు. పవన్ కల్యాణ్ అంటే మురళీ నాయక్‌కు చాలా ఇష్టమని, ఆర్మీకి వెళ్లకముందు జనసేన జెండా పట్టుకుని స్నేహితులతో కలిసి సందడి చేసేవాడని తండావాసులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అప్పటి ఫొటోలను పవన్ కల్యాణ్‌కు చూపించి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

### దేశ సేవలో నేలకొరిగి..

జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి పాక్ సైనికులతో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరోచితంగా పోరాడిన మురళీ నాయక్, దేశ మాత సేవలో వీరమరణం పొందారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి తండా వరకూ వందలాది మంది జనం వెంట నడిచారు. కడపటి వీడ్కోలు పలికేందుకు ఆదివారం ఉదయం నుంచి వేలాది మంది తండాకు తరలివచ్చారు. వేకువ జామునుంచే జవానుకు నివాళులు అర్పించేందుకు క్యూ లైన్‌లో నిలబడ్డారు. జై జవాన్, జై భారత్, మురళీ నాయక్ అమర్ రహే అనే నినాదాలు మిన్నంటాయి. తమ ఊరి బిడ్డకోసం వచ్చిన జనాన్ని చూసేందుకు తండావాసులు మిద్దెలు ఎక్కారు. ఉదయం 8 గంటలకే మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి సత్యప్రసాద్ తదితరులు తండాకు చేరుకున్నారు. మురళీనాయక్‌కు నివాళులు అర్పించి, తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ క్రమంలో వారు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పవన్ కల్యాణ్ గంటపాటు తండాలో గడిపి వెళ్లిపోయారు. నారా లోకేశ్ సహా ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు అంతిమయాత్రలో పాల్గొని, మధ్యాహ్నం అంత్యక్రియలు ముగిసేవరకు అక్కడే ఉన్నారు.

### అధికార లాంఛనాలతో..

వీర జవాన్ మురళీ నాయక్ అంతిమ యాత్ర ఉదయం 11 గంటల తరువాత మొదలైంది. ఇంటి వద్ద నుంచి పార్థివ దేహాన్ని సైనిక వాహనంలో తీసుకుని వారి వ్యవసాయ క్షేత్రానికి బయలుదేరారు. అంతిమయాత్రలో సుమారు 200 మీటర్ల దూరం సైనికులతో కలిసి నారా లోకేశ్ జవాను పాడెను మోశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సైనికులు గౌరవ వందనం సమర్పించారు. గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించి, గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పార్థివ దేహాన్ని పేటిక నుంచి బయటకు తీసి తల్లిదండ్రులకు అప్పగించారు. వారు గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ మట్టి ఇచ్చారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న సహా పలువురు అధికారులు జవానుకు పుష్పాంజలి ఘటించారు.

### ప్రముఖుల నివాళి

పుట్టపర్తి/రూరల్: వీర జవాను మురళీ నాయక్‌కు ఎంపీ బీకే పార్థసారథి, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర, ఎంఎస్ రాజు, దగ్గుబాటి ప్రసాద్, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొల్లకుంట అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఉష శ్రీచరణ్, చాంద్‌బాషా, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ తదితరులు నివాళులు అర్పించారు. వీర జవాను కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. కాలవ శ్రీనివాసులు రూ.50 వేలు అందజేశారు.

### యువతకు స్ఫూర్తి: కుంటిమద్ది లక్ష్మీనారాయణ

పెనుకొండ టౌన్: అగ్నివీర్ మురళీ నాయక్ యువతకు స్ఫూర్తి అని రిటైర్డ్ ఐఏఎస్ కుంటిమద్ది లక్ష్మీనారాయణ అన్నారు. కళ్లి తండాకు వచ్చి వీరజవాన్‌కు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. అంతిమయాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడం మన దేశ భక్తికి నిదర్శనమని అన్నారు. కళ్లి తండా పేరును మురళీ నాయక్ తండాగా మార్చాలని నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. టీడీపీ నాయకుడు వెంకటేశ్వర రావు ఆయన వెంట వచ్చి నివాళులు అర్పించారు.

## ఆత్మబంధువు.. మంత్రి సవిత

అనంతపురం, మే 11(ఆంధ్రజ్యోతి): వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి మంత్రి సవిత అండగా నిలిచారు. తొలి రోజు నుంచి వెన్నంటి ఉన్నారు. విషయం తెలియగానే కళ్లితండాకు వెళ్లి మాతృమూర్తిలా ఆ కుటుంబానికి తోడుగా నిలబడ్డారు. కష్టకాలంలో కన్నీటిని తుడిచారు. ఒక్కగానొక్క కొడుకును పోగొట్టుకుని, పుట్టెడు దుఃఖంలో ఉన్న వీరజవాన్ తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని ఓదార్చారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 లక్షలు అందజేశారు. మరుసటి రోజు మురళీనాయక్ పార్థివ దేహం బెంగళూరు ఎయిర్ పోర్టుకు చేరుకోగానే అక్కడికి వెళ్లి నివాళులు అర్పించారు. వెంట ఉండి స్వగ్రామానికి తీసుకొచ్చారు. నిద్రాహారాలు మాని అన్ని కార్యక్రమాలను దగ్గరుండి చూసుకున్నారు. మంత్రి హోదాను పక్కన పెట్టి, ఆ కుటుంబానికి ఆత్మ బంధువు అయ్యారు. అంత్యక్రియలు నిర్వహించే వ్యవసాయ క్షేత్రానికి మురళీ నాయక్ తల్లి జ్యోతిబాయిని వెంటుండి తీసుకువెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యాక మురళీ నాయక్ తల్లిదండ్రులను వారి ఇంటికి తీసుకువెళ్లి దగ్గరుండి భోజనం తినిపించారు. 'ధైర్యంగా ఉండండి. ఏ కష్టం వచ్చినా అండగా నేనుంటాను' అని భరోసా ఇచ్చారు. మూడు రోజులపాటు వీరజవాన్ కుటుంబానికి అండగా నిలిచి, మానవతను చాటుకున్నారని తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.


వీరజవాన్ తల్లికి అన్నం తినిపిస్తున్న మంత్రి సవిత


జవాన్ అంతిమయాత్రలో జాతీయ జెండాలతో పాల్గొన్న జనం

అమరజవాన్ చివరిచూపు కోసం తరలి వచ్చిన జనం




జవాన్ తండ్రిని ఓదారుస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్


నివాళి అర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి


మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ నివాళి


జవాన్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, మాజీ మంత్రి పల్లె, గుండుమల, ఎంపీ బీకే


గాల్లోకి కాల్పులు..


జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్


జవాన్ అంతిమయాత్రలో పాల్గొన్న జనం